**ఒకరికి ఉపకారం చెయ్యడం ఎంత కష్టమో అపకారం చెయ్యడం అంత సులభం. నమ్మించి మోసం చేయడం అతిసులభం. విధి విధానం అదే అయితే ప్రతిఘటన నిరర్థకం. అంతేనా, మరి?**

# బుద్ధం శరణం గచ్ఛామి

**కావ్యశ్రీ**

**ఆచార్య నాగార్జునుని** మహాయాన మత ప్రచారం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. ఆచార్యుని ప్రియశిష్యుడు ఆర్యదేవుడు తన వాక్సుధాఝరీ ప్రవాహాలతో ఆంధ్రభూమిని ముంచెత్తుతున్నాడు. కనహరీ బౌద్ధ విహారంలో వజ్రయాన మతలతాంకురం మారాకు వేయ సాగింది.

క్రీస్తుశకం 610 ప్రాంతంలో కొల్లేటి చెరువు దుర్గం దగ్గర జరిగిన యుద్ధం బౌద్ధ మత విచ్ఛేదానికి నాంది అయింది. బౌద్ధమతాన్ని మూడు పూవులు, ఆరుకాయలుగా వెలయించి తెలుగుదేశం నలుమూలలా చైత్యాలు, గుహలు, స్తూపాలు, విహారాలు నిర్మించిన మూడవ మాధవ వర్మ కొల్లేటిచెరువు దుర్గం దగ్గర సంకుల సమరంలో మరణించటంతో విష్ణుకుండిన వంశ పాలనతోపాటు బౌద్ధమత పోషణ కూడా అంతరించింది. తెలుగుదేశం చాళుక్యుల వశమయింది. పులకేశి చక్రవర్తి తెలుగువారి ఏలిక అయినాడు.

పులకేశి చక్రవర్తి కొలువు తీర్చి కూర్చున్నాడు. వివిధ విషయాలపై చర్చలు సాగాయి. చివరను మంత్రి గంగన భట్టారకుడు మత విషయాన్ని ప్రస్తావించి బౌద్ధమతం గొప్పతనాన్ని ఉగ్గడించాడు. విష్ణుమతావలంబి అయిన పులకేశి చక్రవర్తి దానిని అంగీకరించలేదు. హిందూమతం కన్న గొప్పమతం లేదని, భగవంతుడు హిందూ మతంలో తప్ప మరొక మతంలో అవతరించడని, బుద్ధుడు అవతారమూర్తి కాడని వాదించాడు. సభాసదులు చక్రవర్తిని కాదనలేకపోయారు. సభలో కల్లోలం బయలుదేరింది. సభ ముగిసింది.

ఆ నాటి రాత్రి అంతఃపురాన చంద్రసేరినికా దేవి తమలపాకులకు సున్నమలంది సువర్ణచూర్ణం చల్లి చిలకలు చుట్టి చిరునవ్వుతో భర్తకందించే చల్లటివేళ నాటి సభాచర్చాంశాన్ని పునశ్చరించింది. బుద్ధుడు అవతారపురుషుడని వాదించింది. వ్యతిరేకవాదన వలదని వారించింది. చక్రవర్తికి పట్టుదల రెట్టించింది. తన ఆంతరంగిక స్నేహితుడు, సర్వశాస్త్ర విశారదుడు, నటుడు, వైష్ణవారాధకుడు అయిన సర్వసిద్ధిని రప్పించి బుద్ధుడు భగవంతుడు కాదని రుజువు చేయమన్నాడు. రాజశాసనాన్ని తలదాల్చి వెళ్ళిపోయాడు సర్వసిద్ధి.

కనహరీ బౌద్ధవిహారంలో కొత్తగా చేరిన కుసుమ లతాభగిని తోటి భిక్షుకీ గణాలకు కంటి మెరమెరలయింది. ఒక సంధ్యా సమయంలో, విహార ప్రాంగణంలో వటవృక్షం క్రిందకూర్చుని ప్రకృతి ప్రశాంతతను, పరమాత్ముని పరమ దయాళుత్వాన్నితలుసుకొంటూఏకాగ్రతతోతన్మయత్వాన్ని అనుభవిస్తున్న గోవిందబోధిసత్త్వుల ముందు ఒక నడివయస్కుడువచ్చి కరాలుమోడ్చి నిలుచున్నాడు. గోవిందబోధిసత్త్వుల వారి ఆజానుబాహు విగ్రహం, దీర్ఘనాసిక, శ్రీ కర్ణాలు, విశాలనేత్రాలు ఆగంతుకుని చూపులను అరికట్టాయి. అట్టే చూచిచూచి సాగిలబడిమొక్కి, "శరణం" అన్నాడు. బోధిసత్త్వులు కన్నులు తెరిచి, "బుద్ధం శరణం గచ్ఛామి" అన్నారు. తర్వాత, "లే, నాయనా! ఎవరు నువ్వు?" అని అడిగారు.

"ఆర్యా! కొంతకాలం క్రిందట హిరణ్యఘటికాస్థానంలో సర్వవిద్యలు పూర్తిచేసి దేశాటనకు వెళ్ళాను. నా యాత్రాకాలంలో బౌద్ధ ధర్మాలను విన్నాను. బౌద్ధులతో సాంగత్యం నెరపాను. ఇప్పుడు బౌద్ధాన్ని స్వీకరింపవచ్చాను. దయతో దీక్ష నిప్పించండి."

"భూతదయాపరత్వమే మనదీక్ష నాయనా!"


"ఆర్యమతావలంబనంలో హృదయ స్పందనాన్ని బంధించడం, నీటిమీద నడవటం, బంగారం చేయటం నేర్చుకొన్నాను. కానీ, ఇంత వరకు ఆత్మ అనే పదార్థం మాత్రం పట్టుపడ లేదు నాకు."

"వద్దు, నాయనా! ఆ గారడీవిద్యలు మనకు వద్దు. 'ప్రపంచమంతా నీ ఆత్మ' అన్న బుద్ధదేవుని సూక్తిని అర్థవంతంగా అనుభవించటం నేర్చుకో! ఆత్మలో పరాన్ని, పరంలో ఆత్మను చూడటం గ్రహించు, నాయనా!"


"దానికోసమే నా తపసు, గురుదేవా!"

"బుద్ధభగవానుడు కరుణామయుడు."

"మహాప్రసాదం!" అని ఆగంతుకుడు తిరిగి సాగిలబడి మొక్కాడు. విహారంలోనుంచి వచ్చిన కుసుమలతాభగిని వానిని లోపలకు తీసుకుపోయింది. వేదాంతప్రియసత్త్వుడువచ్చి గురువు కభిముఖంగా కూర్చున్నాడు. వారి సంధ్యాపారాయణ ఓంకారంతో ప్రారంభమయింది.

కిసాన్
లాంతరు
ఈ రకపువాటిలో ఉత్తమమైనది
అన్ని పెద్ద స్టోర్లలోను లభిస్తుంది
గౌర్ మోహన్ దాస్ & కం.,
233, పాత చైనాబజార్ వీధి, కలకత్తా-1.
ఫోన్ : 22-6580.




లిచెన్‌సా
వాడండి
DZ 1613 ATG



వానరాలు, మాసాలు గతించిపోసాగాయి. హేమంత శిశిరాలు వెళ్ళిపోయాయి. వసంతం వసందుగా పల్లవించింది. శిలీముఖనదీ సైకతం పండువెన్నెలలో, పాలకడలిపై పూలపాముపులా కనబడుతూంది. ఆ సైకత ప్రశాంత వాతావరణంలో 'సర్వసిద్ధి' మలివెచ్చని గాఢాశ్లేషంలో కుసుమలతాభగిని లోకాన్ని మరిచి, తనను తాను మరిచి, ఆనందో బ్రహ్మ అన్న విధంగా ఉండగా పరిచితమైన అడుగుల చప్పుడు విని త్రుళ్ళిపడి లేచింది. ఎవరో దూరదూరంగా సైకతపుటంచున నడిచి వెళ్ళిపోయారు. ఆ పాముకోళ్ల చప్పుళ్ళు, ఆ మందగమన పదాంచల విన్యాసం కుసుమలతాభగినికి సుపరిచితాలే!

"ఎందుకలా త్రుళ్ళిపడి లేచావు, కుసుమా?"

"ఎవరో మనలను చూచినట్టున్నారు!"

"నలుగురూ చూడాలనే కదా మన తాపత్రయం? మనలను చూచి బౌద్ధభిక్షువులు

సంసారులు కావాలి. గుహావిహారాలు శృంగారకేళీ మందిరాలుగా మారాలి. అప్పుడు తేలాలి బుద్ధుడు భగవంతుడవునో కాదో?''

''అక్కడే నాకు సందేహం. భక్తులను పాడు చేసినంత మాత్రాన భగవంతుడు, భగవంతుడు కాకపోతాడా?''

''మానవునిబలం మతాన్నిబట్టి, మతస్థిరత్వం భగవంతునిబట్టి నిలబడుతుందని సమ్యగ్వాద సిద్ధాంతం. మానవుడు జయించినట్లయితే, అతని మతం జయించినట్లే! ఆ మతకర్త అవతార పురుషుడే. బుద్ధుడు భగవంతుడైతే ఈ

## బుద్ధం ....

విహారాల పవిత్రత పాడుగాదు.''

''ఇదే సరియైన నిదర్శనమా? నేను నమ్మను.''

''చూదాం నమ్మకమైనదేదో!'' శిలిముఖనదీ జలాలలో గ్రుంకులిడి చంద్రుడస్తమించాడు. ప్రత్యూష పవనాంకురాలు వింజామరలు వీవ సైకతమే ఘూంపిస్తుంది. ప్రాభాత మరీచి మాలికలు వారికి కర్తవ్యాన్ని గుర్తుచేశాయి.

ఒకనాడు గోవిందబోధిసత్త్వులు ఒంటరిగా కూర్చున్న వేళ సర్వసిద్ధి వచ్చి ఎదురుగా నిల్చున్నాడు.

''కూర్చో, నాయనా!''

''చిత్తం, గురుదేవా!''

''ఏదో అడగాలని వచ్చినట్టున్నావు?''

''ఒక్క సందేహం, గురుదేవా.''

''చెప్పు, నాయనా.''

''ఈ ప్రపంచం నిరంతర కార్యకారణ బద్ధమై అవిచ్ఛిన్నమైన మహాశృంఖలమనీ, ఇక్కడి సర్వవిషయాలకు, సర్వ సంఘటనలకు ఏకత్వముందని కదా భగవానుని మతం?''

''అవశ్యం!''

''అవిచ్ఛిన్నమైన ప్రపంచంలో ఉన్న మనం, అభిన్నమైన ఏకత్వంనుండి వేరుపడి తద్భిన్నమైన ప్రణవాన్ని, నిర్వాణాన్ని పొందటం సాధ్యమంటారా? నిర్వాణం కూడ ఈ అభిన్నమైన ఏకత్వంలోనిదే అయితే, ఇక దాని గురించి మనం వేరే ప్రయత్నించవలసిన పనేముంటుంది? అది కూడా మనలోనే ఉంటుంది కదా?''

''నీ సందేహం నీ శాస్త్ర పాండిత్యానికి నిదర్శనం, నాయనా! అదిగో, చూడు. నీ చెంత నొక మర్రిపండు రాలింది. దానిని బద్దలు చేసి చూడు. సరి. అందులో ఏమున్నదంటావు?''

''గింజలున్నాయి.''

''ఒక గింజను బద్దలుచేసి చూడు. అవునా? ఇప్పుడు చెప్పు! ఆ గింజలో ఏమున్న దంటావు?''

''ఏమీ లేదు.''

''కాదు, నాయనా! ఆ గింజలో మహోన్నతమైన వటవృక్షాని కాధారమైన మహత్తరశక్తి దాగిఉంది. అలాగని ఆ గింజలోనే వృక్షముందంటామా? లేక వృక్షమయ్యే శక్తి లేదంటామా? అలాగే భిన్నమైన ఏకత్వంలోను, ఏకమైన భిన్నత్వంలోను నిర్వాణముంది. అవి కలపబడేవీ కావు, విడదీయబడేవీకావు. ఆ అనిర్వచనీయమైన శక్తినే పరమాత్మ అంటారు. అది ఆత్మ సంయమనం వల్ల అనుభవించవలసిందేగాని, ఆలకించి గ్రహింపగలిగేది కాదు, నాయనా! ఆత్మ సాక్షాత్కారమైతే అన్ని సంశయాలు విడిపోతాయి. ఆత్మసందర్శనాన్ని అలవరుచుకో, నాయనా!''

''మహా ప్రసాదం, గురుదేవా!''

కాలం గతించిపోతున్నది. ఎండలు ముదురుతున్నాయి. ఆ నాడు కుసుమలతాభగిని దరిజేర వచ్చేవేళకు సర్వసిద్ధి త్రాగుడు మైకంలో ఇసుకతిన్నెపై పడుకొని ఉన్నాడు. ఆమె వచ్చి, నదిలోని నీరుతెచ్చి, ముఖం కడిగి కూర్చుండబెట్టింది. అప్పటికతనికి మెలుకువ వచ్చింది.

''ఏమిటి, స్వామీ! బోధిసత్త్వుల సహనాన్ని పరీక్షించడానికి నటనకై తెచ్చిపెట్టుకున్న ఈ త్రాగుడు, మీకు నిజంగా అలవాటుగా మారిందా? చక్రవర్తి పట్టుదల, రాజశాసనం, మీ కర్తవ్యం మరిచారా?''

''ఏం చేయమంటావు, కుసుమా? త్రాగినా,



జూదమాడినా, వ్యభిచరించినా, ఏంచేసినా బోధి సత్త్వులు నన్ను ప్రేమించటం మానకున్నారే? నన్నెందుకని బహిష్కరించి పొమ్మనరు, చెప్పు? వారి ప్రేమకు నేనే అర్పణమై పోతున్నానా? ఈ హృదయ సంఘర్షణ భరించలేక తాగుతున్నాను. తాగిన కొలదీ సంఘర్షణ పెరుగుతూంది. పెరిగే కొలదీ తాగవలసి వస్తోంది, కుసుమా!"

"చక్రవర్తి రహస్యంగా పంపించే డబ్బంతా ఈ తాగుడికి ఖర్చయితే పోనివ్వండి. మన సంసారం, జీవితం కూడా బలికావటం మాత్రం నేను సహించలేను. మీరీ అలవాటును విడిచి పెట్టకపోతే, ఉన్న యథార్థాన్ని నేనే బోధిసత్త్వ లకు చెప్పేస్తాను."

"నీ వనుకున్న యథార్థం కల్పనగాను, ఒక నాటి కల్పన యథార్థంగాను మారుతున్న సంధ్యా కాలమిది. చెప్పినా చెప్పకపోయినా యథార్థమే నిలబడుతుంది. ఇక నా తాగుడును విడవట మంటావా? దానిని విడవగలిగిన నాడు నిన్ను మాత్రం విడవలేకపోతానా!"

"ఏమిటి? నన్ను విడిచిపోతారా?"

"అవును. ఎందుకలా వణికిపోతావు? ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రూపంలో ఆ పని జరిగేదే కదా!"

"మీ ధోరణి నాకు భయంగా ఉంది. కృత్రిమ సన్యాసిగా నటించబోయి, నిజంగా సన్యాసం స్వీకరించేలా ఉన్నారే! ఇంతకాలం మరుగున దాగి వున్న ఈ శక్తి, ఇప్పుడు మీలో మేలుకొంటూ ఉందా ఏం?"

"నా కంతుదొరకని బాధను నువ్వు గుర్తించావు, కుసుమా! తాగుడులో, జూదంలో, వనితా పరీరంభంలో, ఎక్కడున్నా ఎందుతోనూ కలియని దేదో నాలో ఉన్నట్లు, అది ఇప్పుడిప్పుడే నిద్ర మేల్కొంటున్నట్లు నా కనుమానంగా ఉంది, కుసుమా!"


"దేని గురించి మీ కాలోచన?"

" 'నా'లో లేని 'నీ' గురించే!"

"నా గురించా? ఏమని?"

"ఈ నా, నీ ల మధ్య దూర మెంతఅని?"

"అబ్బా! ఈ వేదాంతం చాలించండి. మనకీ నటనా వద్దు. పరీక్షలూ వద్దు. రాజధానికి వెళ్ళిపోదాం. ఇతరులను పాడుచేసే ఈ పాడుపని మనకు వద్దుబాబూ" అని గోముగా అతని చెక్కిళ్ళ పుణికి గాఢంగా కౌగలించింది. ఆ వెన్నెలలో, ఆ మంద పవన వీచికలలో, ఆమె గాఢా లింగనంలో సర్వసిద్ధికి హృదయాంతరాళంలో ఒక మెరుపు మెరిసింది. అవ్యక్తం వ్యక్తమై నట్లు, భిన్నంనుంచి ఏకత్వం సిద్ధించినట్లు, శూన్యం నుంచి విశ్వం జనించినట్లు, చీకటిలో కోటి వెలుగులు విరజివమ్మినట్లు, మృత్యువే అమృతాన్ని అందించినట్లు విచిత్రమైన అనుభూతి కలిగించింది. ఆత్మ సాక్షాత్కరించి అభేదాన్ని అవగతం చేసింది. కనహరీ బౌద్ధవిహారం నుంచి గోవిందబోధిసత్త్వులవారి కంఠంమధుర మందరంగా వినిపించింది: "ఓం అసతోమా

సద్గమయ తమసోమాజ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతం గమయ!" సర్వసిద్ధి తనలో తానే ఐక్యమై పోయాడు. కుసుమలతాభగిని స్థాణువై పోయింది.

ఒకనాటి ఉదయం బాల భాస్కరుడు తన పసిడి కరాలుచాచి పద్మినీ కుమారికలకు గిలిగింతలు పెడుతుంటే, వారి రాగ రంజిత ముఖారవిందాలు ప్రకృతిలోని ప్రణవ మాధుర్యాన్ని స్ఫురింపజేయుటం ఆకాంక్షతో తిలకిస్తున్నారు గోవిందబోధిసత్త్వులు. వేదాంత ప్రియసత్త్వుడు వచ్చి ప్రణామము లాచరించాడు.

"ఏమయ్యా, ప్రియసత్త్వా?"

"ఏమని చెప్పను, గురుదేవా! విహారంలోని కల్లోలానికి కారణం అవగత మయింది కదా? సర్వసిద్ధిని బహిష్కరించే ఏర్పాటు చేయనుంటారా?"

"సర్వసిద్ధిలో సర్వ ప్రపంచాన్నీ చూడగలుగుతున్నాం. అతన్ని విగ్రహించి మనకు మనం ఆత్మ సంయమనం చేసుకో గలిగితే మనః సవిత్రత సాక్షీభూత మవుతుంది కదా?"

"గురుదేవుల భావన గ్రహింపలేకున్నాను."

"పాలు త్రాగి ప్రతివారూ బ్రతకగలరు. విషం త్రాగికూడా మనం బ్రతకగలగాలి. అప్పుడేకదా మన ప్రత్యేకత, ప్రియసత్త్వా?"

"ఆ ప్రయత్నంలో మన ప్రాణాలు దక్కకపోతే?"

"బుద్ధ భగవానుని అభిమత మదే అయితే అలాగే జరుగుతుంది. భగవంతునిలో ప్రతి ప్రాణి ఉన్నట్టుగనే ప్రతిప్రాణిలోను భగవంతుడున్నాడు కదా? ఆత్మ సంస్కారంతో చీకటిని వెలుగుగా మార్చుకోవాలి మనం." తర్వాత గోవిందబోధి సత్త్వులు మౌనం వహించారు. ప్రియసత్త్వుడు మెల్లగా నిష్క్రమించాడు.

కృష్ణా నాసవు మండు టెండలో శిలీముఖ సైకతంపై కూర్చుని ధ్యాన సమాధి మగ్న మానసుడయ్యాడు సర్వసిద్ధి. అతనికోసం విహార మంతటా వెదికి అక్కడకు వచ్చిన కుసుమలతా భగిని అతన్ని చూచి నిర్విణ్ణురాలయింది. తన కాళ్ళు బొబ్బలెత్తుతున్నా లెక్కచేయకుండగా అతని నెత్తుకొని అల్లంత దూరాన తీరాన ఉన్న మాకంద తరుచ్ఛాయకు తీసుకుపోయింది. అప్పటికి ధ్యాన భంగమయింది సర్వసిద్ధికి.

"ఏమిటిది, కుసుమా?"

"మీకు నిజంగా మతి చలించలేదు కదా! ఏదో చేయబోయి తానే మారుతున్నట్లు ఏమిటి మీకీ వైరాగ్యం? ఈ మండు టెండలో కూర్చున్నారు. కాలటంలేదా మీకు?"

"నీ కాళ్ళు కాలలేదా?"

"నాకా గుర్తులేదు. నా మనసంతా మీ మీద ఉండటంచేత ఆ సంగతి గమనించలేకపోయాను."

"అవును. నీ మనసు నా మీద. నా మనస్సు ఆత్మ సంయమనంమీద. నా మీద ప్రేమచేతనే ఇంత చేయగలిగినదానవు—నీ మీద నీకు ప్రేమ గలిగితే ఇంకెంత చేయగలవో సుమా! నిన్ను నువ్వు ప్రేమించడం నేర్చుకోవాలి, కుసుమా!"

"మీ వేదాంతం నా కర్థంకాదు. రండి, రాజధానికి పోదాం. ఇక్కడుంటే ఇక మీరు నాకు దక్కరు. లేవండి. ఇలాగే వెళ్ళిపోదాం."

"వద్దు, కుసుమా! త్రాగేకొలదీ ఎక్కువవుతుందీ దాహం. అనుభవించే కొలదీ అధిక మవుతుందీ తృష్ణ! సెలవు, కుసుమా! వెళతాను!"

"ఎక్కడికి?"

"సత్య పదార్థం లభించేచోటికి. 'నేను'ను విడిచి ఆత్మ పరమాత్మగా సాక్షాత్కరించేచోటికి. నిర్వచింపలేని ఏదో అనుభూతిని కొలదిగా చవిచూశాను. ఆ అనుభూతిని పరిపూర్ణంగా గ్రహించి నిత్య సత్యంగా నిలుపుకొని ఏకాగ్రతతో అనుభవించాలి. సెలవు."

"స్వామీ!" అని కూలబడిపోయింది కుసుమలతాభగిని. ముందుకు అలా అలానడచి సాగిపోయాడు సర్వసిద్ధి. ఉవ్వెత్తుగా లేచి చాళుక్య రాజధాని వైపు పరుగులెత్తింది కుసుమలతాభగిని.

పులకేశి చక్రవర్తి అంతఃపురాన చంద్ర సిరినికాదేవితో సరస సల్లాపాలాడే చల్లటి సమయంలో దూతిక వచ్చి రాజ దర్శనార్థం కుసుమలతాదేవి వేచి ఉందని విన్నవించింది.

"కుసుమలత ఎవరు, దేవీ?"

"మరచితిరా, ఆర్యా? మీ ఆంతరంగిక స్నేహితుడు సర్వసిద్ధిస్వామిని భార్య. వాళ్ళిద్దరు బౌద్ధ మత ప్రభావాన్ని పరీక్షింపబోయారుకదా?"

"అవును. వెంటనే ప్రవేశపెట్టు." మరుక్షణంలో కుసుమలతాదేవి చక్రవర్తి పాదాల చెంత మోకరిల్లి చక్రవర్తిని ప్రణమిల్లి గోడుగోడున విలపించింది.

"ఏమిటిది? ఏమయింది? సర్వసిద్ధి ఎక్కడ?"

"ఏమని చెప్పను, ప్రభూ! బౌద్ధులను పరీక్షింపబోయి వారే బౌద్ధంలో కలిసిపోయారు."

"ఆశ్చర్యం. కఠోర వైష్ణవాచార పరాయణుడు, భారతీయ తత్త్వశాస్త్ర కోవిదుడు బౌద్ధమతం స్వీకరించాడా? నేను చూడాలి. ఎక్కడ సర్వసిద్ధి?"

"హిరణ్య ఘటికాస్థానం దాటిన తర్వాత, కనహేరీ బౌద్ధవిహార ప్రాంతంలో శిలీముఖ నదీతీరాన తిరుగాడుతున్నారు, ప్రభూ!"

"మంచిది. అక్కడికేపోయిచూదాం." మరుక్షణంలో సర్వసన్నాహాలు జరిగిపోయాయి. పులకేశి చక్రవర్తి సపరివారంగా బయలుదేరాడు. ఉన్మాదిలా కూర్చున్న సర్వసిద్ధి చెంతకు వచ్చారు. చక్రవర్తి ఏనుగుదిగి దగ్గరకు వచ్చాడు.

"నన్నెరుగుదువా?"

"నన్నుమాత్రమే నే నెరుగుదును!"

"ఎవరు నువ్వు?"

"ఏమీకాని పదార్థాన్ని."

"మరి బుద్ధుడెవరు?"

"అన్నీ అయిన పదార్థం!"

"బుద్ధుడు భగవంతుడు కాదా?"

"భగవంతుడుకాని దెవరు? ప్రతి పుట్టుకలోను మృత్యువుంది. ప్రతి వెలుగు కిరణం చాటునా నీడ ఉంది. ప్రతి నిరాశ వెనుకా ఆశ ఉంది. ప్రతి పాపిలోను భగవంతుడున్నాడు. ఇక బుద్ధుడు భగవంతుడు కాక పోవటమనేదేముంది?"

"ఆచార్య నాగార్జునుని శూన్యవాదం హిందూ భక్తిమార్గానికి సన్నిహితం. దాని ప్రకారం కనిపించేదంతా మిథ్య కాదంటావా?"

"కాదు. కనుపించేదంతా మిథ్యే అయితే నువ్వూ, నేనూ కూడా మిథ్యకావాలి. మిథ్యనైన మనం మిథ్యకాని మోక్షాన్ని సాధించాలనుకోవటం హాస్యాస్పదం! మోక్షసాధన తప్పితే మత ప్రయోజన మేముంది? నదిని దాటటానికి పడవ కావాలి. పడవ ఎప్పుడూ నీటిమీదనే ఉండాలి. కానీ పడవ లోనికి మాత్రం నీరు రాకూడదు. అంతే ఈ ప్రపంచం. మోక్షాన్ని సాధించటానికి ఈ



గరుత్మంతుడు

ఫోటో—ఎస్. ముజీర్ (బాపట్ల)

ప్రపంచం కావాలి మనకు. ఇది మిథ్య కాదు. ఏదీ మిథ్యకాదు. అంతా సత్యం. సృష్టికాధారమైన సది సత్యం కాని మిథ్యకాదు. ఇలారా! వచ్చి నా చేయి ముద్దుపెట్టుకో."

ముద్దు పెట్టుకోగానే చక్రవర్తికి బాహ్యస్మృతి తప్పింది. విభ్రాంతుడైపోయాడు. సర్వసిద్ధి కోటానుకోట్ల బుద్ధులుగా విడిపోయినట్లు, ఈ సృష్టి సమస్తం కలిసి ఒకే బుద్ధుడుగా మారినట్టు చక్రవర్తి మనోనేత్రానికి గోచరమయింది. క్షణకాలంలో సర్వ రహస్యాలు విడిపోయాయి. "బుద్ధం శరణంగచ్ఛామి" అని సర్వసిద్ధి పాదాల చెంత మోకరిల్లి చరణాలు తాకి బాహ్యస్మృతి పొందినాడు. అదే సమయంలో సర్వసిద్ధి నిర్వాణం చెందాడు. నాటితో బుద్ధుడు విష్ణువు దశావతార మూర్తులలో ఒకడైనాడు. మతం వేరైనా భగవంతుడు ఒకడేనని నిరూపణ మయింది. ★